సాక్షి యాదాద్రి భువనగిరి
ఆదివారం, 10, ఆగస్టు, 2025



**బోనాల పండుగ..**
శ్రావణమాసం బోనాల సందడి నెలకొంది. బోనాల పండుగ నేపథ్యంలో అనుబంధ వ్యాపారాలు జోరందుకున్నాయి. - 8లో



**బుద్ధవనం సందర్శనకు ఆసక్తి**
బుద్ధవనం సందర్శనకు మహాయాన బుద్ధ విహార ప్రధానాచార్యుడు ఆసక్తి కనబర్చారని శివనాగిరెడ్డి తెలిపారు. - 8లో



**అసంపూర్తిగా ఉపకేంద్రాలు**
పాటిమట్ల, పాడిచేడు, కంచనపల్లి గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి. - 9లో

## న్యూస్‌రీల్

### రైతుబీమాకు దరఖాస్తుల ఆహ్వానం

**యాదగిరిగుట్ట రూరల్:** రైతుబీమా పథకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు యాదగిరిగుట్ట డివిజన్ ఏడీఏ శాంతినిర్మల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1966 ఆగస్టు 14, 2007 ఆగస్టు 14 మధ్య జన్మించి, 2025 జూన్ 5వ తేదీ నాటికి కొత్త పాస్ పుస్తకాలు పొందిన రైతులు అర్హులన్నారు. ఈనెల 13న చివరి తేదీ అని.. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను దరఖాస్తు ఫారానికి జతచేసి సంబంధిత మండల వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో నేరుగా అందజేయాలని పేర్కొన్నారు. వివరాల కోసం మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

### యాదగిరి క్షేత్రంలో నిత్యారాధనలు



జోడు సేవను ఊరేగిస్తున్న అర్చకులు

**యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం వేకువ జామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు అభిషేకం, సహస్రనామార్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు చేశారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయంలో ఊరేగించారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

### నిండుకుండ.. నాగార్జునసాగర్

**నాగార్జునసాగర్ :** సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. నాగార్జునసాగర్ గరిష్ట స్థాయి నీటి మట్టం 590.00 అడుగులు (312 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 589.70 అడుగులు (311.1486 టీఎంసీలు)గా ఉంది. ఎగువనగల శ్రీశైలం జలాశయం నుంచి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 65,780 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి 65,530 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం నుంచి విద్యుదుత్పాదన ద్వారా కృష్ణా నదిలోకి 29,313 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, వరద, ఏఎమ్మార్పీ కాలువల ద్వారా మరో 15,577 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతుండడం.. ప్రాజెక్టు గరిష్టస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో ఆదివారం ఉదయం క్రస్ట్ గేట్లను ఎత్తేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

### మూసీకి వరద ఉధృతి

**కేతేపల్లి :** మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. శనివారం సాయంత్రం వరకు ఎగువ నుంచి 5,082 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు ప్రాజెక్టు ఐదు క్రస్ట్‌గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి 9,598 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా.. నీటిమట్టాన్ని 643.50 వద్ద నిలకడగా ఉంచి ఎగువ నుంచి వస్తున్న వరద మొత్తం దిగువకు వదులుతున్నారు. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 286 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.0 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.

### ● అనుబంధాల రాఖీ



సంస్థాన్‌నారాయణపురం: రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి

# విషజ్వరాలతో విలవిల!



భువనగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఓపీ విభాగం వద్ద కిక్కిరిసిన రోగులు

**విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు**
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిట
- ఓపీలో సగానికి పైగా జ్వరపీడితులే..
- 15 డెంగీ కేసులు నమోదు
- వైద్యారోగ్య శాఖ గణాంకాల్లో చేరనవి మరెన్నో..

**సాక్షి, యాదాద్రి :** విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో మార్పులు, చెత్తాచెదారం, మురుగు నీరు.. దీనికి దోమలు తోడై ప్రాణాంతక వ్యాధులను మోసుకొస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్, డెంగీ బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. భువనగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రితో పాటు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ప్రైవేట్ వైద్యశాలలు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పది రోజులుగా 600 వరకు ఓపీ నమోదవుతుండగా అందులో జ్వరంతో వచ్చే వారి సంఖ్య సగానికి పైనే ఉంటుంది.

**ఉదయం నుంచే కిక్కిరిసిపోతున్న ఓపీ విభాగం**
జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉదయం 9గంటల నుంచే ఓపీ విభాగం కిక్కిరిసిపోతోంది. డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలతో వచ్చిన రోగులు ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. జ్వర నమూనా పరీక్షల కోసం ల్యాబ్‌కు క్యూ కడుతున్నారు. అయితే వ్యాధి నిర్ధారణ కోసం రెండు, మూడు రోజులు నిరీక్షించాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ల్యాబ్ సౌకర్యం ఉన్నా సాయంత్రం వేళలో, ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో సిబ్బంది ఉండటం లేదని వాపోతున్నారు. గత్యంతరం లేక ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. డెంగీ జ్వరానికి సకాలంలో వైద్యం చేయించుకుంటే ప్రమాదం వుండదు. ఇది సోకితే రోగి శరీరంలో ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గడం సహజం. రక్తకణాల లెక్కింపునకు రోజూ పరీక్షలు చేయించుకోక తప్పని పరిస్థితి. ఇక ఎండోస్కోపిక్ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్తున్నారు. వేల రూపాయలు ఖర్చు అవుతుండడంతో పేదలతో పాటు మధ్య తరగతి రోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

**రోజూ 550 వరకు ఓపీ..**
భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సాధారణ రోజుల్లో 350 నుంచి 400 వరకు ఓపీ ఉంటుంది. కానీ, పది రోజులుగా 550 వరకు ఓపీ పెరిగింది.
**జనవరి నుంచి జ్వరపీడితులు ఇలా..**
సాధారణ జ్వరం 18,493, డెంగీ 15, చికున్ గున్యా 2, టైఫాయిడ్ కేసులు 3 నమోదైనట్లు వైద్యారోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. కానీ, వీరి సంఖ్య అనధికారికంగా వేలల్లో ఉంటుంది.

**ప్రైవేట్‌లోనూ ఫుల్**
ప్రైవేట్ ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా డెంగీబారిన పడి చికిత్స పొందుతున్న వారి సంఖ్య పెరుగుతున్నా.. వారి వివరాలు వైద్యారోగ్య శాఖకు చేరడం లేదు. వీరితో పాటు వైరల్ ఫీవర్ బాధితులు పెద్ద ఎత్తున ఉంటున్నారు. కొందరు హైదరాబాద్‌లోని ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

**అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం**
వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. డ్రెయినేజీల నిర్వహణ సరిగా లేకపోవడంతో దోమల బెడద పెరిగింది. అనారోగ్యంతో జనం ఆస్పత్రుల బాట పడుతున్నా అధికారులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా పట్టణాల్లో ఖాళీ స్థలాలు, ఇళ్ల మధ్యనే మురుగు నీరు ప్రవహిస్తోంది.



చౌటుప్పల్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జంక్షన్‌లో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

# రహదారులపై వాహనాల బారులు

**చౌటుప్పల్, భువనగిరి టౌన్ :** రాఖీ పండుగ సందర్భంగా రోడ్లన్నీ రద్దీగా మారాయి. జాతీయ రహదారులు, పల్లె రూట్‌లు.. ఎటు చూసినా వాహనాలతో నిండిపోయాయి. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం మొదలైన రద్దీ శనివారం రెండింతలు పెరిగింది. చౌటుప్పల్ పట్టణంలో హైవేపై రెండు కిలో మీటర్ల మేర వాహనాలు బారులుదీరాయి. దీంతో వాహనదారులు సర్వీస్ రోడ్ల గుండా వెళ్లడంతో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఉదయం 11గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది. పోలీసులు వచ్చి సర్వీస్ రోడ్లపైకి వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. బస్టాండ్, తంగడపల్లి, వలిగొండ రోడ్లు, తంగడపల్లి చౌరస్తా జంక్షన్‌ను శుక్రవారం రోజునే మూసేశారు. వాహనదారులు, స్థానికులు వలిగొండ రోడ్డు, బస్టాండ్ ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించారు.

**అర్ధరాత్రి వరకు రద్దీ**
జనాలతో చౌటుప్పల్, భువనగిరి బస్టాండ్‌లు కిటకిటలాడాయి. చాలా మంది సాయంత్రం తిరుగుపయనం కావడంతో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రద్దీ కొనసాగింది. ఏ బస్సు చూసినా సామర్థ్యానికి మించి ప్రయాణికులతో కనిపించాయి.



చౌటుప్పల్‌లో విజయవాడ మార్గంలో బారులుదీరిన వాహనాలు



భువనగిరి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు తోసుకుంటున్న ప్రయాణికులు



చౌటుప్పల్ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

# కష్టాలు కనండి.. దారి చూపండి



నేలపట్ల- వర్కట్‌పల్లి మధ్య ఈదుల వాగుపై కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

- ఈదుల వాగుపై కొట్టుకుపోయిన రోడ్డు
- రాకపోకలు బంద్
- పరిశీలించిన సీపీఎం బృందం

**చౌటుప్పల్ రూరల్:** మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి చౌటుప్పల్ మండలం నేలపట్ల - వర్కట్‌పల్లి గ్రామాల మధ్య ఈదుల వాగుపై కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శనివారం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ నేతృత్వంలో పార్టీ బృందం కల్వర్టు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించింది. ఈదుల వాగుపై కల్వర్టు గతంలోనే దెబ్బతిందని.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో గురువారం రాత్రి కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయిందన్నారు. వానాకాలానికి ముందే మరమ్మతులు చేసి ఉంటే కారు కొట్టుకుపోయేది కాదన్నారు. మునుగోడు, భువనగిరి నియోజకవర్గాలతో ముడిపడి ఉన్నందున ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తక్షణమే స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాగీరు కిష్టయ్య, మండల కార్యదర్శి గంగదేవి సైదులు, నాయకులు తడకమోహన్, యనమల సంజీవ, దబ్బుటి బక్కయ్య, మాజీ ఎంపీటీసీ బత్తుల శంకర్, బుట్టి కృష్ణ, గుర్రం కృష్ణ, డీవైఎఫ్ఐ నాయకులు బత్తుల వేణు, ఇట్టగోని మల్లేశం, దబ్బుటి భాను, యనమల్ల నవీన్ పాల్గొన్నారు.

# వరంగల్ హైవేపై మరో ఫ్లైఓవర్

- కొండమడుగుమెట్టు నుంచి ఎయిమ్స్ వరకు నిర్మాణం
- మొదలైన పనులు



ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్న దృశ్యం

**బీబీనగర్:** హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై నూతనంగా మరో ఫ్లై ఓవర్ రానుంది. బీబీనగర్ మండల పరిధిలో కొండమడుగుమెట్టు నుంచి ఎయిమ్స్ వైద్యకళాశాల వరకు మూడు కిలో మీటర్ల మేర ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించిన పనులు మొదలయ్యాయి. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు.

**తరచూ ప్రమాదాలు**
జాతీయ రహదారిపై కొండమడుగుమెట్టు వద్ద క్రాసింగ్ అవుతున్న క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురై ఎంతో మంది మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. అలాగే ఎయిమ్స్ వద్ద హెచ్చరిక బోర్డులు, సూచికలు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణంతో వాహనదారులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

# డిమాండ్ల సాధనకు 11నుంచి పాదయాత్ర



మాట్లాడుతున్న ఎస్‌కే చాంద్

**రామన్నపేట :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మైనార్టీసెల్ రాష్ట్రకన్వీనర్ ఎస్‌కే చాంద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రామన్నపేటలో నిర్వహించిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారుల డిమాండ్ల సాధనకు ఈనెల 11వ తేదీ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారులకు ఇంటి స్థలంతోపాటు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గంగాపురం యాదయ్య, కూనూరు శ్రీనివాస్, నర్ర అండాలు, నోముల శంకర్, బెడిద లింగస్వామి, పెండెం రవి, ఎండీ లతీఫ్, అరిగె బాలయ్య, ఎండీ జానీ, నర్ర రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# 12న విద్యార్థుల ఎంపిక

**భువనగిరి:** హైదరాబాద్‌లోని బేగంపేట, రామాంతపూర్‌లో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను ఈనెల 12న కలెక్టరేట్‌లో డ్రా పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు గిరిజన శాఖ జిల్లా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9849704132 ను సంప్రదించాలని కోరారు.

# ఎకరానికి ఒక్కటే బస్తా..

**పరిమితంగా యూరియా పంపిణీ**
- పాస్‌బుక్ ఆధారంగా ఇస్తున్న డీలర్లు
- పూర్తిగా వాడితేనే మరొక బస్తా..
- కొరత ఏర్పడకుండా కార్యాచరణ
- అందుబాటులో 11,000 మెట్రిక్ టన్నుల యూరియా
- ప్రణాళిక ప్రకారం పంపిణీ



ఎరువుల దుకాణంలో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**ఆలేరు:** యూరియా కొరత తలెత్తకుండా వ్యవసాయ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. అందుబాటులో ఉన్న నిల్వలను పరిమితంగా పంపిణీ చేస్తున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం ఆధారంగా ఎకరానికి ఒక బస్తా, అది పూర్తిగా వాడితేనే మరొక బస్తా ఇస్తున్నారు. ప్రస్తుతం 4,500 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా.. వర్షాలు కురుస్తుండటంతో మరో 1,500 మెట్రిక్ టన్నులకు ఇండెంట్ పెట్టారు.

**ముందస్తు జాగ్రత్తగా..**
ఇతర జిల్లాల్లో యూరియా కొరత తలెత్తడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి సమస్య రాకుండా జిల్లా వ్యవసాయ శాఖ ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించారు. గతంలో ఎకరాలతో నిమిత్తం లేకుండా రైతులు అడిగినంత యూరియా పంపిణీ చేసేవారు. కానీ, రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పరిమితంగా యూరియా పంపిణీ చేయాలని నిర్ణయించారు. సాగు విస్తీర్ణం ప్రకారం ఫర్టిలైజర్ దుకాణాలు, పీఏసీఎస్, డీసీఎంఎస్, ఆగ్రో రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా ఇస్తున్నారు. అది కూడా రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉందని పట్టాదార్ పుస్తకం పరిశీలించి యూరియా పంపిణీ చేస్తున్నారు. అవసరం లేకపోయినా రైతులు ముందస్తుగా ఎక్కువ యూరియా తీసుకెళ్లి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నందున, పాస్‌పుస్తకంలో నమోదైన ఎకరాల ప్రకారం పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. తద్వారా కొరతకు చెక్‌పెట్టారు.

**అంచనా మేరకు వినియోగం జరగలేదు**
సీజన్ ప్రారంభంలో వ్యవసాయ ఇచ్చిన ఇండెంట్ ప్రకారం యూరియా కోటా కేటాయించలేదు. వచ్చిన యూరియాలో కూడా జూన్, జూలై మాసాల్లో అంచనా మేరకు వినియోగం జరగలేదు. జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా.. 52 శాతానికి మించలేదు. వర్షాభావ పరిస్థితుల వల్ల సాగు విస్తీర్ణం పడిపోయి యూరియా వినియోగంపై ప్రభావం పడిందని అధికారులు భావిస్తున్నారు. పరిమితంగా పంపిణీ చేయడంతో రైతుల ముందస్తు నిల్వలకు బ్రేక్ పడి యూరియా కొరత రాకపోవడానికి కారణమని చెబుతున్నారు.

**సగం కోటానే వచ్చినా కొరత లేకుండా..**
వానాకాలం సీజన్‌కు మొత్తం 32,830 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ఇందులో ముఖ్యంగా జూన్, జూలై, ఆగస్టు నెలలు పంటల సాగుకు కీలకం. ఈ మూడు నెలలకే 27,900 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాధికారుల అంచనా. ఇప్పటి వరకు 15,500మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే జిల్లాకు వచ్చింది. అందులో 11వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఇంకా 4,100 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

**యూరియా కొరత లేదు**



జిల్లాలో యూరియా కొరత లేదు. 234 ఫర్టిలైజర్ డీలర్లు, 35 పీఏసీఎస్, 8 రైతు సేవా కేంద్రాలు, 2డీసీఎంఎస్ కేంద్రాల్లో ప్రస్తుతం 4,500 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. ఎకరానికి ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నాం. అవసరం మేరకు రైతులు మళ్లీ కావాలంటే ఇస్తున్నాం. ఇందుకోసం 1,500 మెట్రిక్‌టన్నుల యూరియా కోసం కలెక్టర్ ద్వారా ప్రతిపాదన చేశాం. ఈనెల మధ్య వరకు వరినాట్లు వేసుకునే అవకాశం ఉన్నందున సాగు విస్తీర్ణం మరికొంత పెరుగుతుంది.
–పీవీ.రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

**12 బస్తాలు ఇచ్చారు**



12ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎకరానికి రెండు చొప్పున 24 బస్తాల యూరియా అవసరం ఉంది. ఇప్పటి వరకు 12 బస్తాలే ఇచ్చారు. తీసుకున్న యూరియా పూర్తిగా వాడిన తరువాత మళ్లీ ఇస్తామంటున్నారు. గతంలో ఎంతంటే అంత ఇచ్చేవారు. ఇప్పుడు పరిమితంగా యూరియా పంపిణీ చేస్తున్నారు.
–ఎడవల్లి కనకరాజు, రైతు, తుర్కపల్లి

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**భువనగిరి:** గిరిజనుల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. శనివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భువనగిరి మండలం పగిడిపల్లి పరిధిలో గల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అవకాశాలను కల్పిస్తున్నాయని చెప్పారు. గిరిజన సమాజం, సంస్కృతి సంప్రదాయలను తెలియజేసేందుకు ఏటా ఆగస్టు 9వ తేదీన ఆదివాసీ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. అంతకు ముందు మొక్కలు నాటి, సంత్‌సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, నాయకులు శంకర్‌నాయక్, గణేష్ నాయక్, మోహన్‌బాబు, రాజేష్, చిరంజీవి, సురేష్, భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

## క్లుప్తంగా

### మొక్కలను రక్షించుకుంటేనే మానవ మనుగడ

- పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు



చెట్టుకు రాఖీ కడుతున్న పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు

**కోదాడ:** మొక్కలను రక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ప్రతిఒక్కరూ వృక్షాబంధన్ కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలకు రాఖీలను కట్టి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు అన్నారు. రాఖీ పర్వదినాన్ని పరస్కరించుకొని కోదాడ పట్టణ పరిధిలోని అశోక్ నగర్ వద్ద ఆయన ఆధ్వర్యంలో శనివారం మొక్కలకు రాఖీలు కట్టారు. ప్రతి ఇంట్లో చిన్నా పెద్దా మొక్కల ప్రాధాన్యతను గుర్తించి ఈ కార్యక్రమాన్ని తమ ఇంటి నుంచే ప్రారంభించాలని, ముందు ఇంట్లో మొక్కలను, ఆ తర్వాత ఇంటి ముందు మొక్కలను రక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ బషీరుద్దీన్, ఆవుల శివప్రసాద్, షేక్ షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### వాగులో కొట్టుకుపోయిన కారు బయటకు..



క్రేన్ సహాయంతో వాగు నుంచి కారును బయటకు తీస్తున్న దృశ్యం

**చౌటుప్పల్ రూరల్:** భారీ వర్షాలకు శుక్రవారం చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామ పరిధిలోని ఈదుల వాగులో కొట్టుకుపోయిన కారు ఓ చెట్టుకు తాకి ఆగింది. నీటి ఉధృతి తగ్గడంతో శనివారం స్థానికులతో పాటు కారుకు సంబంధించిన వ్యక్తులు కారును వాగు నుంచి బయటకు తీసేందుకు యత్నించగా.. ఇసుక మేటలు వేయడంతో సాధ్యం కాలేదు. దీంతో చౌటుప్పల్ నుంచి క్రేన్‌ను పిలిపించి కారును బయటకు తీశారు. కారు బయటికి తీస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## సోదరా నీవే రక్ష

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సాక్షి నిర్వహించిన 'సెల్ఫీ విత్ రాఖీ' ఆహ్వానానికి విశేష స్పందన లభించింది. మహిళలు, యువతులు, బాలికలు తమ సోదరులకు రాఖీ కట్టి సెల్ఫీ తీసుకుని పంపించారు. అందులో కొన్ని..



గాదాగాని స్వరాజ్యం, నిదానపల్లి, రామన్నపేట



పంతం సాయి శివనాథ్ అండ్ సిస్టర్స్, ఆలేరు



మారుపాకల వెంకటేష్, మోత్కూరు



రామన్నపేటలో..



అప్పం నిహాల్, రక్షిత, సిరిపురం, రామన్నపేట



భారత్‌నగర్, కోమటివాడ, భువనగిరిలో..



పాక రిశాంత్, హర్షిత్, గౌస్‌నగర్, భువనగిరి



పగిడిమర్రి జ్ఞానేశ్వర్, మహేశ్వరి, సుంకిశాల, వలిగొండ



సతీష్, సమాన్విత, గుండాల



వైష్ణవి, అరవింద్, చిత్తాపురం, వలిగొండ



దుబ్బటి వసంత, నేలపట్ల, చౌటుప్పల్



దాచేపల్లి కార్తీక్, చౌటుప్పల్

## విధుల్లో ఉన్న సోదరుడి వద్దకు వెళ్లి..

- రాఖీ కట్టిన సోదరి



సూర్యాపేట జిల్లా కేంద్రంలో కానిస్టేబుల్ శ్రీనుకు రాఖీ కడుతున్న అతడి సోదరి సుజాత

**అర్వపల్లి:** కానిస్టేబుల్‌గా విధుల్లో ఉన్న సోదరుడి వద్దకే వెళ్లి రాఖీ కట్టి తన ప్రేమను చాటుకుంది ఓ సోదరి. వివరాలు.. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన రమావత్ సుధాకర్ భార్య సుజాత శనివారం తన సోదరుడికి రాఖీ కట్టడానికి సూర్యాపేట జిల్లా కేంద్రానికి వెళ్లింది. ఆమె సోదరుడు లునావత్ శ్రీను సూర్యాపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శనివారం పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఉండగా సుజాత నేరుగా అక్కడికి వెళ్లి పొట్టి శ్రీరాములు విగ్రహం పక్కనే సోదరుడు శ్రీనుకు రాఖీ కట్టింది. ఈ సంఘటనను స్థానిక ప్రజలు ఆసక్తిగా గమనించారు.

## బుద్ధవనం సందర్శనకు అమెరికన్ల ఆసక్తి

- బౌద్ధ పరిశోధకుడు శివనాగిరెడ్డి



న్యూయార్క్ కెనాల్స్ వీధిలోని బౌద్ధాలయంలో ఈమని శివనాగిరెడ్డి (ఎడమ)

**నాగార్జునసాగర్:** నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని, నాగార్జునకొండను సందర్శించటానికి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో గల మహాయాన బుద్ధ విహార ప్రధానాచార్యుడు ఆసక్తి కనబర్చారని బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. బౌద్ధాలయాల సందర్శనలో భాగంగా శనివారం ఆయన న్యూయార్క్ కెనాల్ వీధిలోని మహాయాన బౌద్ధాలయాన్ని సందర్శించి బుద్ధవనం, నాగార్జునకొండను సందర్శించమని ప్రధానాచార్యుడిని ఆహ్వానించినట్లు తెలిపారు. బుద్ధవనంలో ఆచార్య నాగార్జునుడి రచనలపై ఒక పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలని, కృష్ణా నది తీరంలో విలసిల్లిన ప్రముఖ బౌద్ధ స్థావరాల వివరాలను తెలుసుకోవడానికి తగిన సమాచారం అందజేయమని బుద్ధ విహార ప్రధానాచార్యుడు కోరారని ఆయన పేర్కొన్నారు. బుద్ధవనం అధికారులను కలిసి ఈ విషయంపై చర్చించి కేవలం దక్షిణాసియా దేశాల నుంచే కాక యూరోప్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల బౌద్ధ పర్యాటకులను ఆకర్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. ఆయన వెంట ప్రముఖ ఆహార శాస్త్రవేత్త, న్యూయార్క్ తెలుగు లిటరరీ అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధి, కథా రచయిత డాక్టర్ కలశపూడి శ్రీనివాసరావు ఉన్నారు.

### ప్రభుత్వాస్పత్రిలో పాము

**భువనగిరి:** భువనగిరి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం రాత్రి పాము రావడంతో రోగులు గమనించి దానిని చంపేశారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో చెత్తాచెదారం వేస్తుండడం, విద్యుత్ దీపాలు సరిగా లేకపోవడంతో పాములు వస్తున్నాయని రోగులు అంటున్నారు. ఆస్పత్రి ఆవరణను శుభ్రంగా ఉంచడంతో పాటు రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు వేయాలని కోరుతున్నారు.

## బోనాల పండుగ.. ఉపాధి మెండుగ

- గ్రామాల్లో శ్రావణమాసం బోనాల సందడి
- కుండలు, నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లు, బ్యాండ్, డప్పులు, ఎల్ఈడీ లైటింగ్‌కు ఫుల్ గిరాకీ

సండే స్పెషల్



**రామగిరి(నల్లగొండ), సూర్యాపేట అర్బన్:** ఉమ్మడి జిల్లాలో శ్రావణ మాసం బోనాల సందడి నెలకొంది. హైదరాబాద్‌లో ఆషాడమాసంలో బోనాలు నిర్వహిస్తే, పల్లెల్లో మాత్రం శ్రావణమాసంలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పండుగకు ఇంటికొచ్చే బంధువులు, ఆడపడుచుల రాకతో బోనాల వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. బోనాల పండుగ సామాజికంగా, ఆర్థికంగా చాలామందికి ఉపాధి కల్పిస్తోంది.

### మట్టి కుండలకు గిరాకీ

బోనాల పండుగలో భాగంగా అమ్మవార్లకు ప్రతి కుటుంబం నుంచి బోనం సమర్పిస్తారు. కుమ్మరి వృత్తివారు వివిధ ఆకారాల్లో బోనం కుండలతో పాటు దానిపై దీపం పెట్టే మూతను ఒక సెట్‌లాగా తయారు చేసి అమ్ముతున్నారు. బోనాల సీజన్‌లో కుండలకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో నెల రోజుల ముందు నుంచే కుండల తయారీ ప్రక్రియ ప్రారంభించారు. ఆర్డర్లకు అనుగుణంగా కుండలు, చిన్న గురిగిలను తయారు చేసి ఇస్తున్నారు.



### నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లు అ'ధర'హో..





సాధారణ రోజుల కంటే శ్రావణమాసం బోనాల సమయంలో నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. భక్తులు అమ్మవారికి నాటుకోళ్లు, గొరెర పొట్టేళ్లను బలిస్తారు. సాధారణంగా నాటుకోడి కిలో రూ.500 ఉంటుంది. ప్రస్తుతం డిమాండ్ ఎక్కుగా ఉండడంతో రూ.600 నుంచి 700 వరకు ధర పలుకుతోంది.

### కుల వృత్తులకు కలిసొచ్చే పండుగ..



బోనాల ఊరేగింపులో బ్యాండ్, డప్పు చప్పుళ్లు, డీజేలు ఉపయోగిస్తుతండడంతో వారికి ఉపాధి లభిస్తోంది. మాంసం విక్రయించే వారు, చాకలి, మంగలి కుల వృత్తుల వారు, ఎల్ఈడీ లైటింగ్, నైవేద్యం తయారీకి కిరాణా సామాను కొనుగోలు చేస్తుండడంతో ఆర్థికంగా లబ్ధి చేకూరుతోంది.

### వ్యాపారులు, ప్రభుత్వానికి లబ్ధి

బోనంతో పాటు అమ్మవారిని అంకరణకు పూలు, మామిడి ఆకులు అవసర ఉండడంతో పూల మార్కెట్లలో వ్యాపారం ఊపందుకుంది. కొబ్బరికాయలు విక్రయించే వారికి కూడా గిరాకీ పెరిగింది. బస్సుల్లో ప్రయాణించే వారితో ఆర్టీసీకి, బోనాల సందర్భంగా మద్యానికి డిమాండ్ పెరిగి ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.



### గిరాకీ బాగుంది



శ్రావణమాసం బోనాల పండుగ సందర్భంగా కుండల గిరాకీ బాగానే ఉంది. సూర్యాపేట పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు దగ్గర కుండలు పెట్టి విక్రయిస్తున్నాను. వివిధ సైజులను బట్టి రూ.150 నుంచి 300 దాకా అమ్ముతున్నాం.

– నిమ్మనకొట్టి పూలమ్మ, కుండల వ్యాపారి, సూర్యాపేట

### రకరకాల డిజైన్లతో తయారు చేస్తున్నాం



వివిధ రకాలుగా బోనం కుండలను డిజైన్ చేసి అమ్ముతున్నాం. బోనం కుండ మూత దానిమీద పెట్టే గురిగి, వెయ్యి గండ్ల బోనం, సాదా బోనం కుండ, అలంకరణ చేసిన బోనం కుండలను విక్రయిస్తున్నాం. వెరైటీని బట్టి ధర ఉంటుంది.

– మురళి, కుమ్మరి బజార్, సూర్యాపేట

### ముందుగానే ఆర్డర్లు ఇస్తారు



బోనాల పండుగ కోసం మట్టి కుండలు, చిన్న గురుగులు, దీపం మూతలను ముందుగానే ఆర్డర్లు ఇస్తారు. దానికి అనుగుణంగా తయారుచేసి పంపుతాం. ఇంటి వద్ద కూడా విక్రయిస్తాం. నెల రోజుల పాటు ఆర్థికంగా చేదోడుగా ఉంటుంది.

– బొడ్డుపల్లి మల్లయ్య, కుండల తయారీదారుడు, నల్లగొండ





## అనారోగ్యంతో వలస కార్మికురాలు మృతి

**చౌటుప్పల్ రూరల్:** చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామ పరిధిలో శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో వలస కార్మికురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లా రాంజోర్ గ్రామానికి చెందిన దయా(35)కు అదే ప్రాంతానికి చెందిన సాగర్‌తో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దయా గత 8 సంవత్సరాలుగా భర్త సాగర్‌ను వదిలేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బురంగపాల్‌కు చెందిన దేవాంత్‌తో సహజీవనం చేస్తోంది. దేవాంత్ చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామ పరిధిలోని ఓ టింబర్ డిపోలో పనిచేస్తూ అక్కడే రూంలో ఉంటున్నాడు. దయా కూడా అతడితో కలిసి ఉంటోంది. దయా ఆస్తమాతో పాటు గుండె సంబంధిత రోగంతో బాధపడుతోంది. ఇటీవల హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో పనిచేస్తున్న కొడుకు వద్దకు వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఈ నెల 5వ తేదీన తిరిగి ఆరెగూడెం వచ్చింది. శుక్రవారం సాయంత్రం దేవాంత్ టింబర్ డిపోలో పనిచేసి రూంకు వెళ్లేసరికి దయా మృతిచెంది ఉంది. వెంటనే టింబర్ డిపో యాజమానికి సమాచారం ఇవ్వడంతో అతడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. చౌటుప్పల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం దయా మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని దేవాంత్‌కు అప్పగించారు. పోస్టుమార్టంలో గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహారెడ్డి తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 10కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్

**సూర్యాపేటటౌన్:** గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగారం పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ శనివారం విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పెద్దకొడగల్ మండలం పోరాటం గ్రామానికి చెందిన పడవాల్ సుధార్, కాటేపల్లికి చెందిన భర్దవాల్ శంకర్ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో ఈ నెల 3న ఏపీలోని విశాఖపట్నం, పాడేరుకు వెళ్లి వారికి పరిచయం ఉన్న మహేష్ అనే వ్యక్తి వద్ద 10కిలోల గంజాయి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వారు 7వ తేదీన బయల్దేరారు. శుక్రవారం మధ్యాహ్నం సూర్యాపేట మీదుగా తొర్రూర్ వెళ్లేందుకు నాగారం ఎక్స్ రోడ్డు వద్ద బస్సు దిగగా.. నమ్మదగిన సమాచారం మేరకు నాగారం పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి 10కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## యోగాసన పోటీల్లో బంగారు పతకాలు

**సూర్యాపేట :** ఆదిలాబాద్‌లో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి 6వ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్–2025లో సీనియర్–బి విభాగంలో సూర్యాపేటకు చెందిన గూడూరు నాగేశ్వర్‌రావు నాలుగు ఈవెంట్లలో పాల్గొని నాలుగింటిలో కూడా ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించినట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి శనివారం తెలిపారు. అలాగే సీనియర్–ఎ విభాగంలో దేశగాని ఉప్పలయ్య నాలుగు ఈవెంట్లలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కోదాడకు చెందిన కీత శ్రీనివాసరావు సీనియర్–ఎ విభాగంలో ఒక ఈవెంట్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు.

## కుటుంబ కలహాలతో బలవన్మరణం



రాంరెడ్డి (ఫైల్)

**కేతేపల్లి:** కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కేతేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన దుబ్బాక రాంరెడ్డి(47) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాంరెడ్డి గ్రామంలో రెండేళ్ల క్రితం చేపట్టిన ఇంటి నిర్మాణం కోసం తెలిసిన వారి దగ్గర అప్పు చేశారు. చేసిన అప్పు తీర్చకపోగా మద్యం సేవిస్తూ కొంతకాలంగా ఎలాంటి పనికి వెళ్లడం లేదు. ఈ విషయమై రాంరెడ్డి తన భార్య స్వాతితో తరుచూ గొడవ పడుతుండేవాడు. శుక్రవారం రాంరెడ్డి మరోసారి భార్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన రాంరెడ్డి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కొంతసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు రాంరెడ్డిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కేతేపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు.

## లారీల్లో నుంచి డీజిల్ చోరీకి యత్నం

- పోలీసులను చూసి పారిపోయిన దొంగలు



ఇన్నోవా కారులోని డీజిల్ క్యాన్లు

**నార్కట్‌పల్లి:** నార్కట్‌పల్లి మండల కేంద్రం పరిధిలో నల్లగొండ బైపాస్ వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ చోరీ చేసేందుకు యత్నించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకోగా దొంగలు పారిపోయారు. ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలో నల్లగొండ బైపాస్ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీల వద్ద శుక్రవారం రాత్రి ఇన్నోవా కారు అనుమానాస్పదంగా ఆగి ఉండడంతో పక్కనే ఉన్న టీస్టాల్ యజమాని డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారును పరిశీలిస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. వాహనాన్ని పరిశీలించంగా 50 లీటర్ల సామర్థ్యం గల 30 డీజిల్ క్యాన్లు, మూడు ప్లాస్టిక్ పైపులు లభించాయి. అందులో 24 క్యాన్లలో డీజిల్ ఉండగా.. 8 క్యాన్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 1200 లీటర్ల డీజిల్, ఇన్నోవా కారు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలను పరిశీలించగా చౌటుప్పల్ మండలం రెడ్డిబాయి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీలో నుంచి డీజిల్ దొంగిలించి పట్టుబడిన ఇన్నోవా వాహనంలో తరలిస్తున్నట్లు రికార్డయ్యిందని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. గత కొన్ని నెలలుగా గుర్తుతెలియని వ్యక్తులు ఇన్నోవా వాహనంలో వచ్చి హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారితో పాటు నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి పక్కన ఆగి ఉన్న లారీల్లో డీజిల్ దొంగతనం చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కోదాడకే నవోదయం

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- కేఆర్ఆర్ కళాశాల స్థలంలో ఏర్పాటు
- 19.12 ఎకరాల భూమి కేటాయింపు
- భవన నిర్మాణాలకు రూ.50 కోట్లు మంజూరు



**కోదాడ:** కోదాడకు జవహర్ నవోదయ విద్యాలయం మంజూరైంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట జిల్లాకు మంజూరు చేసిన నవోదయ విద్యాలయాన్ని కోదాడలో ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. అయితే కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ వద్ద ఉన్న కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్థలంలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. డిగ్రీ కళాశాలకు దాదాపు 50 ఎకరాల స్థలం ఉండగా దానిలో 25 ఎకరాల స్థలం వృథాగా ఉంది. దీనిలో 19.12 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం నవోదయ విద్యాలయానికి కేటాయించారు.

**త్వరలోనే టెండర్ల ప్రక్రియ**

కోదాడలో ఏర్పాటు చేయబోయే నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 12 వతరగతి వరకు సీబీఎస్ఈ విధానంలో బోధన జరుగుతుంది. ఈ విద్యాసంవత్సరం (2025–26)లోనే సూర్యాపేటలో దీన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన విషయం విదితమే. కేఆర్ఆర్ కళాశాల వద్ద ప్రభుత్వం కేటాయించిన ఈ స్థలంలో విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసింది. త్వరలోనే నవోదయ విద్యాలయ సమితి టెండర్లను పిలిచి భవన నిర్మాణ పనులను చేపట్టనుంది. రెండేళ్లలోపే పూర్తి భవనాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిసింది. భవన నిర్మాణాలు పూర్తికాగానే ప్రస్తుతం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నడుస్తున్న ఈ విద్యాలయాన్ని కోదాడకు మార్చనున్నారు. ఈ నవోదయ విద్యాలయానికి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరించనున్నారు. కోదాడకు జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు చేయడం పట్ల కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.